మొక్కుబడిగా 'ప్రజావాణి'

- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల అసంతృప్తి
- కొన్నిచోట్ల గైర్హాజరవుతున్న ఉన్నతాధికారులు
- కింది స్థాయి సిబ్బందితో మమ అనిపిస్తున్న వైనం



నెన్నెల: ఫిర్యాదులు స్వీకరిస్తున్న మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు

కోటపల్లి: మండలంలో నెలకొన్న సమస్యలను మండలస్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంను అధికారులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఉన్నా అధికారులు అవేమి పట్టనట్లు, కిందిస్థాయి సిబ్బందితో మమా అనిపిస్తున్నారు. ఇటీవల ప్రజావాణి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ప్రజలు సమస్యలు చెప్పుకునేందుకు రావడంలేదని అధికారులపై ఎంపీపీ సురేఖా ఆగ్రహం వ్యక్తం చేసినా, అధికారుల తీరు మారడం లేదు. ఒకరిద్దరు అధికారులు హాజరైనా సమయం కాకముందే సంతకాలు చేసి వెళ్తున్నారని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ప్రజావాణిపై మండలవాసులకు అవగాహన కల్పించి, ప్రజావాణికి హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మండలవాసులు పేర్కొంటున్నారు.

కబ్జాకు గురవుతున్న భూమిని కాపాడాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామ సమీపంలోని సెంట్రల్ సిల్క్ బోర్డుకు సంబంధించిన భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ నాయకులు సోమవారం చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మండల ప్రత్యేకాధికారి కృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో పట్టు గూళ్ల పెంపకం కోసం పెంచుతున్న ఏరుమద్ది చెట్లను కొందరు అధికార పార్టీ నాయకులు నరికి, ఈ భూమి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులు రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు సుశీల్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కొండపాక చారి, గడిపెల్లి సంతోష్, సంజయ్, సంతోష్, రఘు, దేవాజి తదితరులు పాల్గొన్నారు.

భీమారం: సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణిని ప్రజలు సద్వియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు.

నెన్నెల: ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని, గైర్హాజరైన అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు హెచ్చరించారు. నెన్నెలలో నిర్వహించిన ప్రజావాణికి సోమవారం మండల స్థాయి అధికారులు కాకుండా కింది స్థాయి అధికారులు హాజరుకావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 24శాఖల అధికారులు ఉండగా నలుగురే అధికారులు హాజరుకావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంలో ఒక రోజు నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరుకాకుంటే మండల పరిస్థితి, పురోగతి ఎలా తెలిసేది అని మండిపడ్డారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి సమస్యను మండల స్థాయిలోనే వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఇకముందు ప్రజావాణికి అధికారులు గైర్హాజరైతే మెమోలు జారీ చేయనున్నట్లు తెలిపారు. చిత్తాపూర్ నుంచి ఆసరా పించన్‌కు సంబంధించిన ఒక ఫిర్యాదు రాగా, మైలారం నుంచి మత్తడి వాగు ప్రాజెక్టులో భూమి పోయినా డబ్బులు రాలేదని ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రజావాణిలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ నరేష్, పశువైద్యాధికారి దిలీప్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలి

కాసిపేట: మండలంలో నకిలీ వరి విత్తనాలు సరఫరా చేసి రైతులను నష్టపరిచిన దళారుల సంస్థపై చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రీవెన్స్‌లో రైతులు దరఖాస్తు సమర్పించారు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మయ్య అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించగా, ఎలాంటి దరఖాస్తులు రాలేదు. ఎంపీఓ బాపురావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఏపీఓ సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి పాల్గొన్నారు.

భీమిని: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓలు రాధాకిషన్, సబ్దర్‌అలీలు పేర్కొన్నారు. భీమిని, కన్నెపల్లి ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. గ్రామాల్లో పెన్షన్, నీటి సమస్యకు సంబంధించిన వినతులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు రాంచందర్, లక్ష్మీరాజం, ఎంపీఓ సతీష్, ఏపీఓ శ్రీనివాస్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమిని కాపాడండి'

మందమర్రిరూరల్: మందమర్రి శివారులోని మున్సిపాలిటీ పరిధిలో గల ఊరు మందమర్రి వెళ్లే మార్గంలో గల ఊర చెరువును ఆనుకుని ఉన్నటువంటి 100సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఐ మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్ డిమాండ్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మంచిర్యాలలోని కలెక్టర్ ఆఫీస్‌లో వినతిపత్రం అందించారు. ఈ నెల 16 'సాక్షి' దినపత్రికలో 'ప్రభుత్వ భూమిలో వెంచర్..? అనే వార్తా కథనం ప్రచురితమైన విషయాన్ని గుర్తు చేస్తూ అధికారులు స్పందించాలని కోరారు.

ఘనంగా శివపార్వతుల శోభాయాత్ర



ఉత్సవ విగ్రహాల వద్ద మహిళలు

చెన్నూర్: పట్టణంలోని మార్వాడీ మహిళ సమాజ్ ఆధ్వర్యంలో శివపార్వతుల శోభాయాత్ర (గంగోర్)ను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్వాడీ సమాజ్ మహిళలు మాట్లాడుతూ.. ఏటా ఉగాది పండగకు పక్షం రోజుల ముందుగా మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక మహేశ్వరి భవన్ (మార్వాడీ ధర్మశాల)లో శివ పార్వతులకు పూజలు నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. పక్షం రోజుల తర్వాత శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలతో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో శోభాయాత్ర నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. లోక కల్యాణంతో పాటు పెళ్లి కాని యువతులకు వివాహాలు జరుగుతాయనే అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఏటా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మార్వాడీ మహిళా సమాజ్ మహిళలు పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..



చికెన్ సెంటర్ నిర్వాహకుడికి నోటీసు ఇస్తున్న సర్పంచ్ సుజాత, పంచాయతీ కార్యదర్శి

నెన్నెల: మండల కేంద్రంలోని కుమ్మరివాగు బ్రిడ్జికి ఇరువైపులా చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను వేస్తుండటంతో ఆ ప్రాంతంలో వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తీరుపై సోమవారం 'వంతెన పక్కనే వ్యర్థాలు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నెన్నెల సర్పంచ్ తోట సుజాత, కార్యదర్శి సాగర్ స్పందించి చికెన్ వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. చికెన్ వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను ఊరికి దూరంగా పూడ్చిపెట్టాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే 2018పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చికెన్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న రక్షణ వారోత్సవాలు

- జీఎం(సివిల్) రమేశ్‌బాబు



ర్యాలీ ప్రారంభిస్తున్న జీఎం(సివిల్) రమేశ్‌బాబు

శ్రీరాంపూర్: విధి నిర్వహణలో ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడు రక్షణతో పని చేయాలని సింగరేణి సివిల్ జీఎం రమేశ్‌బాబు తెలిపారు. నస్పూర్‌కాలనీలో సోమవారం సింగరేణి సివిల్ డిపార్టుమెంట్‌లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు రక్షణ వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేఫ్టీ పరికరాలు ధరించి పనిచేయాలన్నారు. ప్రతి ఉద్యోగి తన వ్యక్తిగత రక్షణ చూసుకోవాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ పని చేయాలన్నారు. హెల్మెట్, బూట్లు, రక్షణ బెల్టు ధరించాలన్నారు. ఏ పని చేసినా, దానికి తగిన రక్షణ చర్యలు చేపట్టి చేయాలన్నారు. నాగార్జున కాలనీ శివాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కార్మిక వాడల మీదుగా సివిల్ కార్యాలయంలో ముగిసింది. ఈ సందర్భంగా వారితో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సివిల్ డీజీఎం శివరావు, డీవైఎస్‌ఈలు రాము, శ్రీధర్, ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

'ధరణి'లో నమోదుకు పైసావసూల్

- రూ.5లక్షలు వసూలు చేశాడంటూ ఆరోపణ
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో

నస్పూర్: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన ఓ వ్యక్తి భూమి వివరాలు ధరణిలో నమోదు చేయడానికి ఓ పార్టీకి చెందిన యువ నాయకుడు తన వద్ద సుమారు రూ.5లక్షలు వసూలు చేశారంటూ బాధితులు ఆరోపించిన వీడియో పట్టణంలో సోమవారం వైరల్‌గా మారింది. వీడియోలో పేర్కొన్న వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని 19వ వార్డుకు చెందిన ముత్యాల రాయమల్లు తండ్రి రాజయ్యకు తీగల్‌పహాడ్‌లో సుమారు 3ఎకరాల భూమి వివరాలు ధరణిలో నమోదు కాలేదు. ఈ వివరాలను ధరణిలో నమోదు చేయడానికి ఓ పార్టీకి చెందిన యువ నాయకుడిని సంప్రదించగా ధరణిలో వివరాలు నమోదు చేయడానికి రూ.5లక్షలు ఖర్చు అవుతుందని బాధితుల వద్ద నుంచి రూ.5లక్షలు తీసుకున్నట్లు ఆరోపించారు. తమ వద్ద డబ్బులు వసూలు చేసి, తమకు ఎలాంటి పనిచేయకపోగా, పది గుంటల భూమి కావాలని అడుగుతున్నాడని ఆరోపించారు. తమకు ఈ భూమి తప్పా, వేరే ఏ ఆధారం లేదని వారు వాపోయారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

టీఎస్‌పీఎస్సీకి వ్యతిరేకంగా దీక్ష

చెన్నూర్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీకి వ్యతిరేకంగా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, టిఎస్‌పీఎస్సీ పరీక్ష రాసిన నిరుద్యోగులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను నీటి పాలు చేసి, విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కో కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, చెన్నూర్ నియోజకవర్గ కన్వీనర్ అక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

లక్సెట్టిపేట: ఐకేపీ సెర్ప్ ఉద్యోగులకు పే స్కేలు అమలు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చినందుకు గాను ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చిత్ర పటానికి సెర్ప్ ఉద్యోగాలు క్షీరాభిషేకం చేశారు. ఏపీఎం లక్ష్మి, సీసీలు లచ్చన్న, సురేందర్, వసంత లక్ష్మి, సుమలత, రాజమణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జమున, కార్యదర్శి జమున, కోశాధికారి లక్ష్మి, గ్రామ సంఘం లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు నివేదిక

తాండూర్: మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌పై మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) సత్యనారాయణ సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు నివేదిక పంపారు. మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవలి కాలంలో కొందరు అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తున్న పట్టించుకోకపోవడం, విధులకు సరిగా హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు పలు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

వీడ్కోలు వేడుక..!



ఉపాధ్యాయులతో విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన వీడ్కోలు వేడుకలు అంబురాన్నంటాయి. పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకుని పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సంబురాలు గడిపిన విద్యార్థులు, ఒకరికొకరూ తీపి గుర్తులను పంచుకుంటూ పరీక్షల్లో విజయం సాధించాలని కోరుకుంటూ ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇక పాఠశాల ఆవరణలో అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి ఫొటోలు దిగి ఉపాధ్యాయుల ఆశీస్సులు తీసుకున్నారు.

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం తెలుగు 2023–24నూతన శ్రీ శోభకృత నామ సంవత్సర పంచాంగాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలుతో కలిసి ఆవిష్కరించారు. శ్రీ వైష్ణవ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధనగిరి అనంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వేల్పుల రవి, సంఘం ప్రధాన కార్యదర్శి ఆచి వెంకటరమణాచారి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణచారి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాదచారి, దామోదర్, కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

పోషణ పక్వాడా పక్షోత్సవాలు ప్రారంభం



తాండూర్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఐదో విడత పోషణ పక్వాడా పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. బెల్లంపల్లి సీడీపీవో ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరై పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడ పక్షోత్సవాలను విజయవంతం చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు తగిన కార్యాచరణ తయారు చేసుకోవాలని వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మమత, స్వరూపరాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

మంచిర్యాలటౌన్: పోషణ్ పక్వాడ్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు, అర్కలవాడ, పద్మశాలి కాలనీతో పాటు, ఇతర అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

వర్షానికి నష్టపోయిన పంటల పరిశీలన



చెన్నూర్: మిర్చి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూర్: ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంటలు నీట మునిగాయి. చెన్నూర్, భీమారం, జైపూర్ మండలాల్లో అకాల వర్షానికి నష్టపోయిన పంటలను ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ఉదయ్‌కుమార్, క్లస్టర్ అధికారి తిరుపతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షంతో మిర్చి పంట, మామిడి పంటలకు కొంత నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. మూడు మండలాల్లో నష్టపోయిన రైతుల వివరాలు సేకరించామని, రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

పంట నష్టంపై సర్వే

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట, దండేపల్లి, గూడెం క్లస్టర్‌ల పరిధిలో రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను, మామిడి, కూరగాయల తోటలను వ్యవసాయశాఖ విస్తీర్ణ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వ్యవసాయ, ఉద్యానవనశాఖ సిబ్బంది వేర్వేరుగా తెలిపారు.

పంటల క్షేత్ర సందర్శన

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని శివలింగాపూర్, గుడ్డి రాంపూర్ గ్రామాల్లో యాసంగిలో సాగు చేస్తున్న వరి, పత్తి పంటలను ఏవో కవిత క్షేత్ర సందర్శన చేశారు. యాసంగి వరి, పత్తిలో వచ్చే చీడ, పీడలు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు. ఆమె వెంట ఏఈవో రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ కాయిత రాజేష్, రైతులు హన్మంతరావు తదితరులు ఉన్నారు.

తాండూర్: మండలంలోని గోపాల్‌నగర్‌లో రబీలో రైతులు సాగు చేసిన వరి పంటను సోమవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, తాండూర్ ఏఈవో శంకర్ వరిని పరిశీలించి పంట సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. చీడపీడలు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

కాసిపేటలో ఎమ్మెల్యే చిన్నయ్య పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సోమవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంతో పాటు 10లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం దేవాపూర్ మసీద్ పునఃనిర్మాణం కోసం మంజూరైన రూ.14లక్షల పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడి ముస్లింలతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, ఎంపీటీసీ అక్కెపల్లి శ్రీనివాస్, మండల టీఆర్ఎస్ నాయకులు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో వార్షిక క్రీడలు నిర్వహించనున్నట్లు ఏరియా పీఎం శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రాంభమయ్యే కార్యక్రమానికి జీఎం శ్రీనివాస్ హాజరవుతారన్నారు. షాట్‌పుట్, మహిళల త్రో బాల్, టగ్ ఆఫ్ వార్, పిల్లలకు పరుగు పందెం పోటీలు ఉంటాయని తెలిపారు. ఇది వరకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతుల ప్రదానం ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

22న ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమం

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 22న పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో ముక్తా రవి తెలిపారు. సాయంత్రం 6గంటలకు బుడి దామెదర సిద్ధాంతిచే పంచాంగ శ్రవణ కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నస్పూర్: భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని బెల్లంపల్లిలో ఈ నెల 23న నిర్వహించే కాగడాల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి కోరారు. సీసీసీలోని నర్సయ్య భవన్ వద్ద నాయకులతో కలిసి సోమవారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు.

జనచైతన్య యాత్రను విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: ఈ నెల 25న జిల్లాలోని తాండూర్‌లో ప్రారంభమయ్యే సీపీఎం జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దూలం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

23న పొనకల్ వారసంత వేలం

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ వారసంత, దినసంత 2023–24 సంవత్సరానికి గాను ఈ నెల 23న వేలం వేయనున్నట్లు సర్పంచ్ జక్కు భూమేశ్, ఈవో రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారసంతకు రూ.20వేలు, దినసంతకు రూ.10వేలు డిపాజిట్ చేసి, వేలంలో పాల్గొనాలని సూచించారు. 23న ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు డిపాజిట్ సేకరణ, 12గంటల తర్వాత వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు గ్రామ పంచాయతీలో సంప్రదించాలన్నారు.

వేంపల్లిలో మేకల సంత...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని వేంపల్లి మేకల సంత బహిరంగ వేలంను 23వ తేదీ గురువారం రోజున నిర్వహించనున్నట్లు సర్పంచ్ వోలపు శారద, కార్యదర్శి సత్తు ప్రతిభ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీన నిర్వహించిన వేలంలో దక్కించుకున్న మొదటి, రెండో వేలం పాటదారులు ఇద్దరూ కూడా సకాలంలో డబ్బులు చెల్లించని కారణంగా తిరిగి రెండోసారి మేకల సంత వేలం నిర్వహిస్తున్నట్లు తెలపారు.

23న మండల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 23వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మందపల్లి స్వర్ణలత అధ్యక్షతన జరిగే సమావేశానికి వివిధ విభాగాలకు చెందిన మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి తాజా అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు కూడా విధిగా సమావేశానికి హాజరుకావాలన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వమే బీసీ జనగణన చేపట్టాలి'

- బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకుల డిమాండ్



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనాభా గణన చేపట్టాలని బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల జనగణన విషయంలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా కో కన్వీనర్ సంగెం లక్ష్మణ్, నాయకులు రాసమళ్ల కుమార్, కంచర్ల కొమురయ్య, చంద్రమౌళి, ములుగూరి వెంకటేష్, వేముల కిరణ్, ఆరెందుల రాజేశం, మందపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

నెన్నెల: పంచాయతీ పరిధిలోని దుబ్బగూడం గ్రామానికి చెందిన గంట శంకర్–చిన్నక్కల కూతురు శ్యామల కొంత కాలంగా గర్భక్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న కోవిడ్ వాలంటరీ బృందం వ్యవస్థాపకుడు, నార్వాయిపేట ఉపాధ్యాయుడు జలంపల్లి శ్రీనివాస్ వాట్సాప్ గ్రూపుల ద్వారా సేకరించిన రూ.8వేల నగదును సోమవారం బాధితురాలికి అందజేశారు. అంతకంటే ముందు నెన్నెల వద్ల వాడ యువకులు రూ.20వేల నగదును అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో శ్రీరాంభట్ల రంజిత్, పుప్పిరెడ్డి వెంకన్న, నూతి సందీప్, హమీద్‌బాబా, అరుణ్ సింగ్, ఉపాధ్యాయులు సదయ్య, ప్రకాష్, మంగ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' శిబిరం ప్రారంభం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ ప్రారంభించారు.

జాతోత్ ఠాణునాయక్ వర్ధంతి

పాతమంచిర్యాల: రైతాంగ సాయుధపోరాట యోధుడు జాతోత్ ఠాను నాయక్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీ తండాలో సేవాలాల్ సేనా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పక్షుల కోసం నీటి తొట్టెల ఏర్పాటు

కోటపల్లి: అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో పక్షుల సంరక్షణకు వేసవికాలంలో నీటి కొరత దృష్ట్యా, పాఠశాల ఆవరణలో నీటి తొట్టెలను ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం బుచ్చన్న తెలిపారు. ఇంటి వద్ద నీటి తొట్టెలు ఏర్పాటు చేసి పక్షుల దాహార్తి తీర్చాలని కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనారాయణ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

శానిటేషన్ పనుల పరిశీలన

వేమనపల్లి: గ్రామపంచాయతీ శానిటేషన్ సిబ్బంది ఉదయం 7గంటలకు విధుల్లో చేరి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మయ్య అన్నారు. ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి సోమవారం మొబైల్ యాప్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శానిటేషన్ పనులను పరిశీలించారు. హరితహారం మొక్కలు వందశాతం బతికేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పన్ను వారంలోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం కంపోస్టు షెడ్, వైకుంఠ దామాన్ని పరిశీలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : శ్రీష్ - 8309865990
బెల్లంపల్లి : సురేష్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899